క్లుప్తంగా

రేపు వీర బ్రహ్మేంద్ర స్వాములవారి ఆరాధన మహోత్సవం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలం పోతన్‌పల్లి(ఆర్) గ్రామంలో శనివారం విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆరాధన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు స్వాములవారి ధ్యాన ఆశ్రమ నిర్వాహకులు వడ్ల విఠలాచారి తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా పూజ, యజ్ఞం, ధ్యానశిక్షణ, వివిధ పిరమిడ్ ధ్యానుల అనుభవాలు, ధ్యాన సందేశాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సోషల్ మీడియా కన్వీనర్ల భేటీ



గాంధీభవన్ వద్ద ఖేడ్ నియోజకవర్గంలోని సోషల్ మీడియా కన్వీనర్లు

నారాయణఖేడ్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ నందీష్ (నందు), కో–కన్వీనర్ భూపాల్ రెడ్డి, నియోజకవర్గంలోని మండలాల కన్వీనర్లు విజయ్, విజయ్‌కుమార్ స్వామి,, ప్రకాష్, మూఢ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జలమయమైన రోడ్లు

సంగారెడ్డి టౌన్: చిన్నపాటి వర్షం కురిసినా సంగారెడ్డి పట్టణ ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు జలమయమవుతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సంగారెడ్డి పట్టణంలో ఈదురు గాలులు, ఉరుములతో మోస్తరు వర్షం కురిసింది. సంగారెడ్డి పట్టణ ప్రధాన రహదారులతో పాటు చౌరస్తా ప్రాంతంలో జీన్స్ కార్నర్ ఎదుట రోడ్డుపై నీరు చేరగా.. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా పలు కాలనీలు, ప్రధాన రహదారులపై సైతం నీరు చేరడంతో ఇబ్బందులు తప్పలేదు. అంతర్గత రహదారులు సరిగా లేకపోవడం.. డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో వర్షం కురిసిందటే చాలు ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని. దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవం



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

జహీరాబాద్: జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం రాత్రి గ్రామంలో స్వామివారి పల్లకీ సేవతో ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడకలను నిర్వహించారు.

కత్తితో దాడిచేసిన వారిపై కేసు

కంది(సంగారెడ్డి): మామిడి పండ్ల కోసం గొడవపడి కత్తితో దాడి చేసి గాయపర్చిన వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ బోరబండకు చెందిన మహమ్మద్ ఖలీల్ మండల పరిధిలోని బేగంపేట శివారులోని మామిడితోటను కౌలుకు తీసుకొని పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల15న సాయంత్రం బేగంపేట తండాకు చెందిన పాత్లోత్ ప్రవీణ్, పాత్ లాత్ అనిల్, బేగంపేటకు చెందిన అనిల్‌గౌడ్, సాయికిరణ్‌గౌడ్, ఎద్దు మనోజ్ కలిసి మహమ్మద్ ఖలీల్‌పై కత్తితో దాడి చేసి గాయపర్చారు. ఖలీల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భయం భయం.. ప్రయాణం

- రోడ్డు పక్కన ఉన్న గుంతలతో పొంచి ఉన్న ముప్పు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- గుంతలను పూడ్చాలని స్థానికుల విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు



మాచ్నూర్, బర్దిపూర్ గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఉన్న గుంత

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం.. పర్యవేక్షణ లోపంతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. గ్రామాలకు వెళ్లే రహదారుల పక్కన ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. అయినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. కొన్ని నెలల క్రితం పైప్‌లైన్‌తో పాటు ఇంటర్‌నెట్ కనెక్షన్ కోసం రోడ్డు పక్కన గుంతలు తీసి పలుచోట్ల జాయింట్ కనెక్షన్ ఇచ్చారు. కానీ.. పని పూర్తికాగానే వాటిని పూడ్చడంలో సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

రోడ్డు పక్కన తీసి ఉన్న గుంతలతో ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులతో పాటు వాహనదారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా పైప్‌లైన్ కోసం తీసిన మట్టి కుప్పలు సైతం అలాగే వదిలి వేశారు. రోడ్డు పక్కనే ఉన్న గుంతలు దగ్గరకు వచ్చేంతవరకు కనిపించడం లేదు. రాత్రి సమయంలో వాహనాలు అదుపు తప్పి పడిపోతుండటంతో ప్రయాణికులు ప్రమాదాల భారిన పడుతున్నారు. పనులు పూర్తికాగానే గుంతలను పూడ్చి వేయకుండా వదిలి వేయడంతో వాహనదారులు అధికారులు, కాంట్రాక్టర్లపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గుంతలను పూడ్చాలి

మండలంలోని మాచ్నూర్, పొట్టిపల్లి, చీలపల్లి తండా, కప్పాపూర్‌తో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల పక్కనే చాలాచోట్ల గుంతలు మట్టి కుప్పలు, దర్శనమిస్తున్నాయి. దీంతో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని మట్టి కుప్పలు తొలగించి, గుంతలను పూడ్చాలని వాహనదారులు ప్రయాణికులు కోరుతున్నారు.



పొట్టిపల్లి రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

బస్సు సర్వీసులను పెంచండి



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న భెల్ బస్టాండ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ, బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో అనేక బస్సు సర్వీసులు ఈ మార్గం నుంచి రాకపోకాలు సాగించేవి. లింగంపల్లి, బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్, ఎల్ఐజీ, రామచంద్రాపురం పట్టణం మీదుగా ఆర్టీసీ బస్సులు పటాన్‌చెరుకు వెళ్లేవి. కానీ కొంత కాలంగా పూర్తి స్థాయిలో బస్సు సర్వీసులను అధికారులు తగ్గించారు. దాంతో కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మరికొంత మంది ద్విచక్ర వాహనలపై భెల్ చెక్‌పోస్ట్ వరకు వెళ్లి వారి వాహనాలను ప్రైవేట్ పార్కింగ్‌లో పార్కింగ్ చేసుకుని లింగంపల్లి నుంచి ఆర్టీసీ బస్సులలో రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు ప్రయాణికులతో రద్దీగా ఉండే కీర్తిమహల్ బస్టాండ్ ప్రస్తుతం ప్రయాణికులు లేక వెలవెలబోతోంది. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని స్థానిక ప్రజాప్రతినిధులు సైతం గతంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సర్వీసులను పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం తరలించడం లేదు

- నిరసన వ్యక్తం చేసిన రైతులు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని తరలించడం లేదంటూ రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ మండల పరిధి చండి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 15రోజులు అవుతున్నా తూకం వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు వాపోయారు. అకాల వర్షాల మూలంగా ఇబ్బందులు పడుతున్నామని, ధాన్యం కుప్పలు తడవకుండా కాపాడుకునేందుకు అద్దెకు కవర్లు తీసుకురావడం వల్ల ఆర్థికభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కేంద్రం నుంచి ధాన్యం త్వరగా తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయం గురించి పీఏసీఎస్ సీఈఓ మధును వివరణ కోరగా లోడింగ్ చేసిన ధాన్యం లారీలు ఖాళీ కాకపోవడం వల్ల ఆలస్యం అవుతుందన్నారు.

జోగిపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీకాంత్



అల్లె శ్రీకాంత్



జీఆర్ మధుసూదన్‌రెడ్డి



జి.సంతోష్

జోగిపేట(అందోల్): 2024–2025 సంవత్సరానికిగాను జోగిపేట లైయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని లయన్స్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లె శ్రీకాంత్, సెక్రటరీగా జీఆర్ మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా గడ్డమీది సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. లయన్స్‌క్లబ్ ద్వారా సేవలను అందించి, జోగిపేట క్లబ్‌కు డిస్ట్రిక్ట్ 320 డీలో మంచి పేరు తీసుకువస్తామని అధ్యక్షులు శ్రీకాంత్ అన్నారు. సభ్యులందరి సహకారంతో క్లబ్‌కు మంచి పేరు తీసుకువస్తానని అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

షాపింగ్‌మాల్‌లో తెగిపడిన లిఫ్ట్

ఆరుగురికి తీవ్ర గాయాలు

చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలింపు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఏర్పాటు చేసిన పింగ్‌మాల్‌లో గురువారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. షాపింగ్‌మాల్‌లో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు మొదటి అంతస్తు నుంచి పైకి వెళ్లేందుకు 15 మంది గురువారం లిఫ్టు ఎక్కారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ తరువాత పైకి వెళ్లేందుకు బటన్ నొక్కడంతో ఒక్కసారిగా లిఫ్ట్ వైరు తెగడంతో ఎవరూ ఊహించని విధంగా కింద పడింది. దీంతో లిఫ్ట్‌లో ఉన్న 15 మందిలో ఆరుగురు వ్యక్తులకు కాళ్లు చేతులకు స్వల్ప తీవ్రగాయాలు కావడంతో షాపింగ్ మాల్ యాజమాన్యం చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఓవర్‌లోడ్ కారణంగానే ప్రమాదం జరిగిన సమాచారం.

వర్షం కురిస్తేచాలు.. కరెంట్ కట్

నర్సాపూర్: నర్సాపూర్‌లో కురిసిన వర్షానికి సుమారు రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం కురువగానే పట్టణంలో కరెంటు సరఫరా నిలిచిపోవడం సర్వసాధారణమైందని గురువారం పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. చెట్ల కొమ్మలను మామూలు సమయంలో కొట్టివేయాలని కోరారు. వర్షంతో గాలులు వీయడంతో కొమ్మలు కరెంటు వైర్లకు తగిలి సరఫరాకు అంతరాయం కలుగుతోందని, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వినియోగదారులు సూచించారు. ఏఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా విద్యుత్ వైరు తెగిపోవడంతో మరమ్మత్తులు చేసేందుకు సరఫరా నిలిపివేశామని చెప్పారు. అనంతరం చెట్లకొమ్మలు పడడంతో అంతరాయం ఏర్పడిందని, వాటిని తొలగించి కరెంటు సరఫరా పునరుద్ధరించామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ వానాకాలం సాగు కోసం ప్రతిపాదనలు

రాయికోడ్(అందోల్): వానాకాలం సీజన్‌లో భాగంగా రైతులు సాగు చేసే పంటల కోసం విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ తెలిపారు. మండలంలో 39,800 మంది రైతులు ఉండగా.. వారు 18,500 ఎకరాల సాగు భూమి కలిగి ఉన్నారన్నారు. వివిధ పంటల సాగు కోసం 3,000 టన్నుల యూరియా, 1,800 టన్నుల డీఏపీ, 1,500 టన్నుల కాంప్లెక్స్, 500 టన్నుల పోటాష్ ఎరువులు సరఫరా చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. అదేవిధంగా 100 క్వింటాళ్ల జనుము, 50 క్వింటాళ్ల జీలన విత్తనాలు అందించాలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. రైతులకు పంటల సాగులో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా తగిన ముందస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు.

◆ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ గ్రామ శివారులో గల సాయిబాబా ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకులు సాయిబాబా విగ్రహానికి పంచామృత అభిషేకాలను నిర్వహించి అర్చనలు, పుష్పాభిషేకం, జలాభిషేకం చేపట్టారు. భక్తులు కొబ్బరికాయలు, నైవేద్యాలను సాయిబాబాకు సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ 19న సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవం

జహీరాబాద్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ రమా సమేత సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్స వేడుకలను ఈనెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు నిర్వహించే ఈ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. ఈ సందర్భంగా మహా మంగళహారతి, అన్న మహాప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

◆ అభివృద్ధికి సహకరించండి

సంగారెడ్డి టౌన్: గ్రామాభివృద్ధి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంపీపీ లావణ్య అన్నారు. గురువారం సంగారెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలో సమస్యలను పరిష్కరిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో యాదగిరి ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

◆ బెస్ట్ అవైలెబుల్ పథకం ద్వారా ఉచితవిద్య

నారాయణఖేడ్: బెస్ట్ అవైలెబుల్ పథకం ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతిలో ప్రవేశం పొందిన వారికి పదో తరగతి వరకు ఉచిత విద్య అందించనున్నట్లు నియోప్రగతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ప్రకాష్ తెలిపారు. పథకం ద్వారా ఎంపికైన విద్యార్థులకు పదోతరగతి వరకు ఉచిత విద్య అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 7382174758, 9666953935 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

◆ 18 వాసవీమాత జయంతి వేడుకలు

నారాయణఖేడ్: వాసవీమాత జయంతి వేడుకలను ఈనెల 18న నిర్వహించనున్నట్లు నారాయణఖేడ్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దారం కృష్ణమూర్తి, దారం వీరేశలింగం, కోశాధికారి నగేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జగత్ జనని కులదైవం వాసవీ మాత జయంతి వేడుకలను పురస్కరించుకొని సాయిబాబా ఆలయం ఆవరణలో సామూహిక కుంకుమార్చనలు, వాసవీ వ్రతాలు, లలితా సహస్ర పారాయణం, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ, తదితర కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

◆ గోమారంలో వైభవంగా మహాయాగం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామంలో చతుర్వేత హవనం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పాలకుర్తి సుధాకర్ గౌతమ్‌శర్మ పర్యవేక్షణలో వేలేటి సిద్ధరామేశ్వర శర్మ పూజ మహోత్సవాలు, సాంస్కతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. గురు వారం చేపట్టిన పూజామహోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శుక్రవారంతో మహా యాగం ముగుస్తుందని పూజారులు శాస్త్రుల ఆయాధ్యరామశర్మ, చండికశర్మ తెలిపారు.

ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్



సీసీ రోడ్డు, మ్యాన్‌హోల్‌ను అధికారులకు చూపుతున్న కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు, మ్యాన్ హోల్ నిర్మాణంలో నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో ఆయన పర్యటించారు. వర్తక సంఘం వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, మ్యాన్‌హోల్స్‌ను సరిగా నిర్మించలేదని, దీంతో ఇంట్లోకి వర్షపు నీరు వస్తుందని, కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సీసీ రోడ్డును, మ్యాన్‌హోల్స్‌ను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కొత్త రోడ్లను కూడా మరమ్మతులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు నిర్మాణ దశలో ఉన్నప్పుడు పనులను పర్యవేక్షించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం కారణంగానే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, దీంతో నాణ్యత ప్రమాణాలు లేకుండా పోయిందన్నారు. వెంటనే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విపక్షాల కుయుక్తులు పనిచేయవు

కాంగ్రెస్ నేతల స్పష్టీకరణ



మాట్లాడుతున్న చైర్మన్ ఆనంద్ షెట్కార్, కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్: జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపు కోసం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, పార్టీ కార్యకర్తలు కలసికట్టుగా పనిచేశారని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్, బీసీ సెల్ తాలూకా అధ్యక్షులు సాయిలు పటేల్, కాంగ్రెస్ నాయకులు దిల్‌దార్ ఖాన్, ఎస్టీసెల్ నాయకులు కిషన్‌నాయక్, రవి, మైనార్టీ నాయకులు ఇర్ఫాన్‌లు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిల ఐక్యతను దెబ్బతీసి లబ్ధిపొందాలని, ప్రతిపక్షాలు పన్నుతున్న కుయుక్తులు పనిచేయవని వారు స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమానికి కేపీఎస్ కృషి



మాట్లాడుతున్న కొత్తగొల్ల చంద్రశేఖర్

సదాశివపేట(సంగారెడ్డి): ఎంఆర్ఎఫ్ కార్మికుల సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా కేపీఎస్ కృషి చేస్తోందని కార్మిక పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఎంఆర్ఎఫ్ కార్మిక పోరాట సమితి 9వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్, కేపీఎస్ కార్యదర్శి మల్లేశం, సభ్యులు నారాయణ, శివరాం, విష్ణు, విఠల్, కృష్ణ, అంజయ్య, జనార్ధన్, సుబుత్‌రెడ్డి, రాచయ్యస్వామి, సుధాకర్, కిరణ్, శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి

కిలో రూ.130

సదాశివపేట(సంగారెడ్డి): వంటకాల్లో సామాన్య ప్రజల నుంచి ఉన్నత వర్గాల వరకు ఉపయోగించే పచ్చిమిర్చి ఘాటెక్కిస్తుంది, గురువారం సదాశివపేటలో పచ్చిమిర్చి కిలో ధర రూ 120 నుంచి 130 వరకు పెరిగింది. రెండు నెలల క్రితం పచ్చిమిర్చి కిలో రూ 40 ఉండగా పది రోజుల క్రితం వరకు రూ 80 మాత్రమే ఉండేది. నాలుగైదు రోజులుగా పెరుగుతూ వస్తూ గురువారం రూ130కు చేరింది. సదాశివపేట ప్రాంతంలో పచ్చిమిర్చి పంట దిగుబడి లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, దీంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. కిలో పచ్చిమిర్చి కొనుగోలు చేసేవారు ప్రస్తుతం పావు కిలో కోనుగోలు చేసి సరిపెట్టుకోవాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.

29న చాకరిమెట్లలో విశేష పూజలు



పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి

మాధవానంద సరస్వతి

శివ్వంపేట(నర్సాపూర్): లోక కల్యాణార్థం ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి తెలిపారు. ఆయన గురువారం ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా ముందస్తు పూజాకార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. లక్ష రామనామ తమలపాకులతో అర్చన, ప్రత్యేక అభిషేకాలు చేపడుతున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయ శర్మ, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, నారాయణరావు తదితరులు ఉన్నారు.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

ఏఈఓ రాజశేఖర్‌గౌడ్



తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమశాతం తెలుసుకున్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని చెప్పారు. త్వరితగతిన తూకం వేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఐకేపీ సీసీ నర్సింహులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): ఆరోగ్య అధికారులు జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం డా.వేదశ్రీ, ఆరోగ్య విస్తరణ అధికారి ఓ యాదయ్య తదితరులు పెద్దశంకరంపేటలో ర్యాలీ నిర్వహించారు. రమణ, సాయిలు, వెంకటేశం పాల్గొన్నారు.